

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు

ఆదివారం

22 ఫిబ్రవరి 2026 పేజీలు : 08


- తరుముకొస్తున్న వేసవి తీవ్రత..
- వెంటాడుతున్న పశుగ్రాసం కొరత.. నీటి ఎద్దడి
- మూగజీవాలకు జీవాలకు తప్పని ఆకలి దప్పుల ఇక్కట్లు..
- అలమటిస్తూ వలసల బాట పడుతున్న గోమాతలు
- పట్టించుకోని రైతన్నలు..
- ఇదే అదునుగా ఊపందుకున్న అక్రమ రవాణా
- మేల్కొనకపోతే పశుజాతి కనుమరుగయ్యే పరిస్థితి..

## పాడి పశువులకు ఎంత కష్టమో !

జిల్లాలో ఏడాది ఫిబ్రవరి ద్వితీయార్థం నుంచే తరుముకొస్తున్న వేసవి ఎండల తీవ్రత రోజుకు రెట్టింపవుతూ.. మండే అగ్నిగోళాన్ని తలపిస్తున్న ప్రస్తుత నేపథ్యంలో తీవ్రంగా నెలకొన్న పశుగ్రాసం కొరత, తాగునీటి ఎద్దడిలతో ఆకలి దప్పుల మధ్య అలమటిస్తున్న అమాయక మూగజీవాలు పశుజాతి వలసల బాట పడుతున్న దయనీయ సంఘటనలకు దారి తీస్తున్నాయి. నెల్లూరు జిల్లా అంతటా ప్రస్తుత సీజన్లో పంటలు సాగు చేస్తున్నప్పటికీ ఇంకా పంట కోతలు పనులు మొదలు కాకపోవడం.. దీనికి తోడు గత 15 రోజుల క్రితం వరకు పచ్చదనంతో నిండి ఉన్న పచ్చికబైళ్ళు.. అదేవిధంగా జల కళను సంతరించుకున్న వాగులు.. వంకలు.. చెరువులు.. గుంటలు క్రమక్రమంగా అడుగంటిపోతుండడంతో పాడి ఆవులు.. గేదెలకు అవసరమైన పశుగ్రాసంతోపాటు నీటి ఎద్దడి సమస్య ఏర్పడేందుకు దారి తీసినట్లు తెలుస్తుంది. ఇదే క్రమంలో ఫిబ్రవరి మాసం చివరి దశకు చేరుకోవడంతో మరింత వేగం పుంజుకున్న వేసవి ఉష్ణోగ్రతలు తీవ్రతరం కావడంతో భూగర్భ జలాలు అడుగంటి పోవడం.. చెరువులు, గుంటలు, కాలువలు.. జలాశయాల్లో సైతం నీటిమట్టాలు క్షీణించి తీవ్ర ఎద్దడి అలముకోవడం వంటి పరిణామాల నేపథ్యంలో దాహార్తితో అలమటిస్తున్న అమాయక మూగజీవాలతోపాటు పశుపక్షాదులు సైతం దప్పిక తీర్చుకునేందుకు అవసరమైన తాగునీటి అన్వేషణలో భాగంగా బయట ప్రాంతాలకు పరుగులు తీయాల్సిన దయనీయ పరిస్థితులు నెలకొన్నాయి.





నెల్లూరు/వేదాయపాలెం, మేజర్‌న్యూస్ :

ప్రధానంగా ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని వెంకటాచలం, పూడిపర్తి, గూడూరు, నాయుడుపేట, పెళ్ళకూరు, పాడేరు తదితర ప్రాంతాలకు చెందిన పాడి రైతులు సైతం గోమాతలకు పుష్టిగా ఆహారాన్ని.. తాగునీటిని అందించే వనరులు పుష్కలంగా ఉన్న రాపూరు అటవీ టెరిటోరియల్ రేంజ్ పరిధిలోని రేయి పెంట, మద్రి కాలువ, పందికోన సెల, అల్లికట్ల కాలువ.. పరిసర ప్రాంతాల్లో నెలల తరబడి పశువుల మందతో మెట్టాలు ఏర్పాటు చేసుకుని ఉండటం.. తిరిగి వర్షాకాల సీజన్ ప్రారంభం కాగానే తమ ప్రాంతాలకు పశువులను తరలించుకుపోవడం ఆనవాయితీగా వస్తుంది.

### సందిట్లో సడేమియా.. జోరుగా అక్రమ రవాణా

ఆకలి దప్పులతో అలమటిస్తున్న అలమటిస్తున్న పశువుల గుంపులు (మందలు) దిక్కుతోచని స్థితిలో పిడికెడు గడ్డి.. గుక్కెడు నీటికోసం అన్వేషిస్తున్న నేపథ్యంలో.. ఇదే అదనుగా భావించి రంగంలోకి దిగుతున్న అక్రమార్కులు.. దళారులు ప్రత్యేక యాక్షన్ ప్లాన్ రూపకల్పనతో తమ అసాంఘిక కార్యకలాపాలను యదేచ్ఛగా కొనసాగిస్తున్నారు. గ్రాసం.. నీటి కొరకు -మిగతా 6లో



ఇరిగేషన్‌లో సోమిరెడ్డి

## సరికొత్త దోపిడీ

మాజీ మంత్రి కాకాణి



ఇరిగేషన్ పనులు చేయకుండా సోమిరెడ్డి దొంగ బిల్లులు చేసుకుంటూ వాటికి అదనంగా లిఫ్ట్ పేరిట సరికొత్త దోపిడీకి శ్రీకారం చుట్టాడని వైసీపీ జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డి ఆరోపించారు. 02

ఇంటర్మీడియట్ పరీక్షలకు

## పటిష్ట బందోబస్తు

జిల్లా ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల

నెల్లూరు అర్బన్/క్రైమ్ మేజర్‌న్యూస్ :

ఈనెల 23 నుంచి మార్చి 24 వరకు జరగనున్న ఇంటర్మీడియట్ పరీక్షలకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లాలో జరగనున్న ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రతిరోజు ఉదయం 9 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు ప్రశాంతంగా సాగేందుకు అన్ని పరీక్షా కేంద్రాలలో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశామని, పరీక్షా కేంద్రాల వద్ద సెక్షన్ 144 అమలు చేస్తూ, సమీపంలోని జిరాక్స్ సెంటర్లు మూసివేయునున్నట్లు ఎస్పీ వివరించారు. అదేవిధంగా విద్యార్థులు మొబైల్ ఫోన్లు, స్మార్ట్ వాచీలు, ఐపాడ్‌లు తదితర ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకురావడానికి అనుమతి లేదని, మాస్ కాపీయింగ్, -మిగతా 2లో



సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా

## పేదలకు ప్రాణభిక్ష

- కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చాక నెల్లూరు పార్లమెంట్ పరిధిలో సిఎంఆర్ఎఫ్ ద్వారా 104 మందికి 1 కోటి 52 లక్షల రూపాయల ఆర్థిక సహాయం
- కోవూరు నియోజకవర్గంలో 687 మంది అనారోగ్య బాధితులకు 7 కోట్ల 27 లక్షల రూపాయల ఆర్థిక సహాయం
- ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి

2లో



# హాస్పిటల్స్‌లో బయో మెడికల్ వేస్ట్ శాస్త్రీయంగా నిర్మూలించాలి




'స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర' సందర్భంగా ఎమ్మెల్యే పశాంతి రెడ్డి

**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** పరిశుభ్రతే సగం వైద్యమని, ఒక ఆసుపత్రి ఎన్ని ఆధునిక పరికరాలను కలిగి ఉందనే దానికంటే ఎంత పరిశుభ్రంగా ఉందనేది ముఖ్యమని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. స్వర్ణాంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని పురస్కరిం చుకొని ఆమె ఇందుకూరుపేట మండల కేంద్రంలో విద్యార్థులు, ఆరోగ్య కార్యకర్తలు, స్థానికులతో కలిసి పరిసరాల శుభ్రతపై అవగాహన కలిగేలా నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం ఇందుకూరుపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో బయో మెడికల్ వేస్ట్ మేనేజ్మెంట్ మేనేజ్మెంట్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ.. ఆసుపత్రుల్లోని బయో మెడికల్ వ్యర్థాలను శాస్త్రీయంగా నిర్మూలించక పోతే రోగాలను నయం చేసే హాస్పిటల్స్ రోగాలు వ్యాప్తి చేసే కేంద్రాలుగా మారే ప్రమాదముందన్నారు. వాడిన సిరంజీలు, బ్యాండేజ్ కాటన్ వేస్ట్, ఇతర వ్యర్థాలను సరైన పద్ధతిలో ధ్వంసం చేయకపోతే హాస్పిటల్‌కు వచ్చే రోగులకే కాదు, ఆసుపత్రి సిబ్బంది ఆరోగ్యాలకు కూడా ముప్పేనని ఆమె హెచ్చరించారు. బయో వేస్ట్ నిర్వహణలో పసుపు, ఎరుపు, నీలం, తెలుపు డబ్బాల కలర్ కోడింగ్‌పై సిబ్బందికి అవగాహన కలిగించాలన్నారు. వ్యాధి తగ్గాలంటే వైద్యం, వ్యాధులు రాకూడదంటే పరిశుభ్రత అవసరమన్న విషయాన్ని ప్రజలు గుర్తించాలని తెలిపారు. రోగాల బారిన పడకుండా ఉండాలంటే వైద్యం కన్నా ముందు మన పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని పరిశుభ్రత ఉన్న చోట వ్యాధులకు చోటు ఉండదన్నారు. డాక్టర్లు, నర్సులు, పారిశుధ్య కార్మికులు స్వచ్ఛ ఆంధ్ర యజ్ఞంలో సైనికుల్లా పని చేయాలని కోరారు. ఆసుపత్రి లోపల మాత్రమే కాదు, ఆవరణలో కూడా ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా, చెత్తా చెదారం పేరుకుపోకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. హాస్పిటల్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడంలో ప్రజలు సహకరించాలన్నారు. దాతలను ప్రోత్సహించి 50 లక్షల వ్యయంతో మెడి కల్ ఎక్విప్మెంట్స్ అందచేసిన విషయాన్ని గుర్తు చేస్తూ ఇందుకూరుపేట సీహెచ్‌సీకి ఆసుపత్రి అభివృద్ధికి పాటుపడతానని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి హామీనిచ్చారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపరిటెం డెంట్ డాక్టర్ సునీల్ కుమార్, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు కొల్లారెడ్డి సుధాకర్ రెడ్డి, జిల్లా టిడిపి అధికార ప్రతినిధి చెంచుకిషోర్ యాదవ్, కో ఆపరేటివ్ బ్యాంకు ఛైర్మెన్ అమరేంద్ర రెడ్డి, సీనియర్ నాయకులు పీఎల్ రావు, రవీంద్రారెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షులు శ్రీనివాసులు, షేక్ ఇంతియాజ్, ఈదూరు చెన్నయ్య పాల్గొన్నారు.

## గూటూరు శ్రీధర్ నాయుడు మాతృమూర్తికి ఎమ్మెల్యే నివాళులు



**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్ న్యూస్ :** కోవూరు మండలం గంగవరం గ్రామానికి చెందిన టిడిపి నాయకులు గూటూరు శ్రీధర్ నాయుడు మాతృమూర్తి మరణవార్త తెలుసుకున్న ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంత్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. నెల్లూరులోని వేదయపాలెంలోని శ్రీధర్‌నాయుడు నివాసంలో వారి మాతృమూర్తి పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## ఇంటర్మీడియట్ పరీక్షలకు పటిష్ట బందోబస్తు

*(మొదటి పేజీ తరువాయి)*

మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. జిల్లావ్యాప్తంగా 82 పరీక్ష కేంద్రాలలో పరీక్షలు జరుగుతున్నాయని, స్ట్రాంగ్ రూముల వద్ద ఆర్మ్ గార్డులతో భద్రత, ప్రశ్నా పత్రాలు–సమాధాన పత్రాల రవాణాకు పోలీస్ ఎస్కార్ట్ ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు. పరీక్షా కేంద్రాలలో సీసీ కెమెరాలు, డ్రోన్ నిఘ ఉంటుందని, ఫ్లయింగ్ స్క్వాడ్లు, మొబైల్ పెట్రోలింగ్ బృందాలు నిరంతరం పర్యవేక్షణ చేస్తాయని, విద్యార్థులు ఉదయం 9 గంటల తర్వాత పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించబోమని, ముందుగానే పరీక్షా కేంద్రాల వద్దకు చేరుకోవాలని సూచించారు. ఏదైనా అవాంఛనీయ ఘటనలు జరిగితే వెంటనే 100/112 లేదా పోలీస్ వాట్సాప్ నెంబర్ 9392903413 కు సమాచారం ఇవ్వాలని ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ కోరారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా పేదలకు ప్రాణభిక్ష



**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** రాష్ట్రానికి చంద్రబాబు నాయుడు లాంటి మానవతావాది ముఖ్యమంత్రిగా ఉండడం రాష్ట ప్రజలు చేసుకున్న అదృష్టంగా అభివర్ణించారు వేమిరెడ్డి దంపతులు. నెల్లూరు నగరం మాగుంట లేఔట్‌లోని వీపీఆర్ నివాసంలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిల నెల్లూరు పార్లమెంట్, కోవూరు నియోజకవర్గ పరిధిలోని సీఎంఆర్ఎఫ్ లబ్దిదారులకు చెక్కుల పంపిణీ చేశారు. నెల్లూరు పార్లమెంట్ పరిధిలో శనివారం 19 మందికి 17 లక్షల 53 వేల చెక్కులు పంపిణీ చేశారు. గత 20 నెలల వ్యవధిలో నెల్లూరు పార్లమెంట్ పరిధిలోని 7 నియోజక వర్గాలలో సిఎంఆర్ఎఫ్ ద్వారా 104 మందికి 1 కోటి 52 లక్షల రూపా యల ఆర్థిక అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేద కుటుంబాలలో ఎవరికైనా పెద్ద జబ్బు చేసి ఆ కుటుంబం ఆర్థికంగా చితికిపోతే అలాంటి కష్టకాలంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 'నేనున్నాను' అంటూ సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆదుకుంటూ మానవత్వాన్ని చాటుకుంటున్నాంన్నారు. గతంలో ముఖ్యమంత్రి సహాయ నిధి అంటే నెలల తరబడి నిరీక్షణ ఉండేది, ఆఫీసుల చుట్టూ తిరగడం దళారుల ప్రమేయం.. ఇలా ఎన్నో ఇబ్బందులు ఉండేవని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పాలనలో ఒక మానవీయ కోణం కనిపిస్తోందన్నారు. 20 నెలల స్వల్ప కాలంలోనే కోవూరు నియోజకవర్గంలో 687 మంది అనారోగ్య బాధితులకు 7 కోట్ల 27 లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందచేశామన్నారు. శనివారం 24వ విడతగా 35 మందికి 55 లక్షల 42 వేల చెక్కులు అందిస్తున్నామన్నారు. కార్యక్రమం లో పెన్నా డెల్టా చైర్మన్ జెట్టి రాజగోపాల్ రెడ్డి, కోవూరు మండల పార్టీ అధ్యక్షులు కొల్లారెడ్డి సుధాకర్ రెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు ఇంత మల్లారెడ్డి, ఇందుకూరుపేట టిడిపి అధ్యక్షులు పవన్ కుమార్ రెడ్డి, రాష్ట్ర ఎంఎస్ఎంఈ డైరెక్టర్ వీరేంద్ర నాయుడు, జిల్లా అధికార ప్రతినిధి చెంచు కిషోర్ యాదవ్, విడవలూరు మండల అధ్యక్షులు ఏటూరి శ్రీరెడ్డి, అడపాల శ్రీధర్ రెడ్డి, కొడవలూరు మండల అధ్యక్షులు వెంకటేశ్వర్లు నాయుడు, బుచ్చిరెడ్డి పాలెం మండల అధ్యక్షులు బెజవాడ జగదీష్, బుచ్చి మున్సిపల్ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, పట్టణ అధ్యక్షులు గుత్తా శ్రీనివాసరావు, చేనేత సంఘ నాయకులు కెవి శేషయ్య, బుచ్చి మున్సిపల్ వైస్‌చైర్మన్ యరటపల్లి శివకుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఇరిగేషన్‌లో సోమిరెడ్డి సరికొత్త దోపిడీ



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** ఇరిగేషన్ పనులు చేయకుండా సోమిరెడ్డి దొంగ బిల్లులు చేసుకుంటూ వాటికి అదనంగా లిఫ్ట్ పేరిట సరికొత్త దోపిడీకి శ్రీకారం చుట్టాడని వైసీపీ జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డి ఆరోపించారు. శనివారం మనుబోలు మండలం బద్దివోలు గ్రామంతో పాటు, తోటపల్లి గూడూరు మండలం పేడూరు గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఉగ్గుమూడి రామిరెడ్డి పార్థివ దేహానికి నివాళులర్పించి, ఇటీవల ఆత్మహత్యకు పాల్పడిన విద్యార్థి, వెంకట సుదీప్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రిజర్వాయర్లలో పుష్కలంగా నీరు ఉన్నా, రైతులకు సాగునీరు అందించలేని అసమర్థ ప్రభుత్వం, కూటమి ప్రభుత్వం అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 20 నెలలు కావస్తున్నా, ఇంకా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మీద పడి ఏడవడం చూసి ప్రజలు ఛీ కొడుతున్నార న్నారు. సోమిరెడ్డి ఎప్పుడు అధికారంలో ఉన్నా.. సరికొత్త ఆలోచనలతో నయా దోపిడీలకు పాల్పడడం ఆనవాయితీ అన్నారు. ఇరిగేషన్ కాలువల పనులు చేయకుండానే దొంగ బిల్లులు చేసుకుని దోచుకోవడంతో, సాగునీరు రైతులకు సాఫీగా అందక, అనేక ఇక్కట్లు పడుతున్నారన్నారు. రైతులకు సాగునీరు అందకపోవడాన్ని అదునుగా చేసుకొని, లిఫ్ట్ చేసి సాగునీరు అందిస్తామంటూ, రైతులను అడ్డుపెట్టుకొని మరింత దోపిడీకి సోమిరెడ్డి పాల్పడడం దుర్మార్గం అన్నారు.

సర్వేపల్లి నియోజకవర్గంలో సోమిరెడ్డి అవినీతి దందాలు కొత్త పుంతలు తొక్కుతున్నాయన్నారు. సోమిరెడ్డి ప్రజల సమస్యల పరిష్కారంలో పూర్తిగా విఫలమై, అవినీతి సంపాదన మీదే దృష్టి కేంద్రీకరించాడన్నారు. సర్వేపల్లిలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో ఎన్నడైనా రైతులు సాగునీటికి ఇబ్బందులు పడ్డారా.. అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి సాగునీటి కాలువలు శుభ్రం చేయకుండా, దొంగ బిల్లులు చేసుకుని దోచుకుంటూ, రైతులు సాగునీరు అందక అష్టకష్టాలు పడుతున్నారన్నారు. సోమిరెడ్డి మనుబోలు మండలం కాగితాల పూరులో రైతుల పంటలు ఎండిపోతుంటే తన అవినీతిని కప్పిపుచ్చుకునేందుకు, లిఫ్ట్ ద్వారా నీరు అందిస్తామంటూ మరో అవినీతికి పాల్పడుతున్నాడన్నారు. సోమిరెడ్డి బతుకంతా అవినీతి, అన్యాయం, అక్రమాలు తప్ప, ప్రజల సంక్షేమం, అభివృద్ధి, గురించి ఏనాడు పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. రైతులకు యూరియా అందక అనేక అవస్థలు పడితే, రైతులకు సమర్థంగా యూరియా అందించామని పేర్కొనడం సిగ్గుచేటన్నారు. రైతులకు కాలం చెల్లిన విత్తనాలు అందించి, అవి మొలకలు రాక, పంటలు అదును తప్పి రైతులు అనేక ఇక్కట్ల పాలయ్యారన్నారు. కూటమి ప్రభుత్వం రైతుల పట్ల నిర్లక్ష్య భావాన్ని ప్రదర్శిస్తూ, వ్యవసాయం అంటే దండగ అన్నట్లు వ్యవహరిస్తుందన్నారు. జగనన్న పాలనలో రైతులకు అన్ని విధాల అండగా నిలిస్తే, చంద్రబాబు పాలనలో ఘోర అవమానాలు ఎదుర్కొంటున్నారని, రైతులు అనేక కష్ట, నష్టాలకోర్చి పండించిన పంటలకు కనీసం మద్దతు ధర చెల్లించి ప్రభుత్వం ధాన్యం సేకరించాల్సిందేనన్నారు. ప్రభుత్వం మొక్కుబడిగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ధాన్యం సేకరణ చేపట్టకపోతే రైతుల పక్షాన నిలబడి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పోరాడేందుకు సిద్ధంగా ఉందన్నారు. జగనన్న పాలనలో రైతులకు యూరియా, సాగునీరు, విత్తనాలు, కొరత లేకుండా చూడడంతోపాటు పెట్టుబడి సాయం అందించి, ఉచిత పంటల బీమా సౌకర్యం కల్పించి, రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి, ఈ క్రాప్ బుకింగ్ చేసి రైతులు పండించిన పంటను కొనుగోలు చేసేందుకు 3 వేల కోట్ల ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేసి, అన్ని విధాల రైతులను ఆదుకున్నామన్నారు. చంద్రబాబు పాలనను జగనన్న పాలనను రైతులు బేరీజు వేసుకొని జగనన్న ప్రభుత్వాన్ని తిరిగి కోరుకుంటున్నారు. రాష్ట్రంలో ఏ రోజు ఎన్నికలు జరిగినా భారీ మెజారిటీతో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం, జగనన్న ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా, అన్ని విధాల ప్రజలకు అండగా నిలిచి ప్రజల సమస్యలు, రైతాంగ సమస్యలు.. మా సమస్యలుగా భావించి అన్నివిధాలా అండగా నిలుస్తామని తెలిపారు.

సంబంధం లేని అంశాలను సభలోకి తెచ్చి

# వివాదాలు సృష్టిస్తున్న వైసీపీ సభ్యులు

## ఎమ్మెల్సీ, జిల్లా అధ్యక్షులు బీద రవిచంద్ర



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో, కూటమి పార్టీల నేతల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో టీటీడీ బోర్డు సభ్యురాలు, ఎమ్మెల్యేలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, వంశీధర్‌రెడ్డి, రూప్ కుమార్, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, చేజర్ల వెంకటేశ్వరరెడ్డి, కర్నాటి ఆంజనేయరెడ్డి, భరత్, నూనె మల్లికార్జున యాదవ్, సుజయ్‌లతో కలిసి శాసనమండలి సభ్యులు టీడీపీ నెల్లూరు జిల్లా అధ్యక్షులు బీద రవిచంద్ర పాల్గొన్నారు. ఈ సందర్భం గా బీద మాట్లాడుతూ.. జగన్ హయాంలో తిరుమలలో వివాదం కాని అంశ మే లేదు, వైసీపీ పాలనలో తిరుమలలో అన్యమత ప్రచారం, వెబ్ సైట్, దర్శన టికెట్లపై అన్యమత ముద్రలు భక్తుల మనోభావాలను దెబ్బ తీశాయి. తిరుమల సంప్రదాయాలపై, భక్తుల నమ్మకం, విశ్వాసాలపై ఎలాంటి గౌరవం లేని వ్యక్తి జగన్. తిరుమల తలనీలాలను చైనాకి అక్రమంగా తరలి స్తుంటే ప్రభుత్వ సంస్థ 'అస్సాం రైఫిల్స్' అడ్డుకోవడం వాస్తవం కాదా వైసీపీ హయాంలో జగన్, వారి కుటుంబ సభ్యులు, సన్నిహితులు చేసిన అపచా రాలు.. శేష వస్త్రాల సమర్పణ, మాడ వీధుల్లో జగన్ పర్యటన నాడు వివా దాస్పదం అయ్యాయి. భారతదేశమే కాదు, ప్రపంచ వ్యాప్తంగా దేశాధినేతలు, ప్రధానులు, రాష్ట్రపతులు ఎవరు పర్యటించినా తిరుమల సాంప్రదాయాలను గౌరవించి, డిక్లరేషన్ సంతకాలు చేసి స్వామి వారిని దర్శించుకుంటారు. మేం తప్పు చేశాం.. మాలానే ఇతరులకు మరక అంటించాలి, వారిపై కూడా బురద చల్లాలనే కుట్రలకు వైసీపీ పాల్ప డుతోంది. ఏ మాత్రం సంబంధం లేని హెరిటేజ్ సంస్థను ప్రస్తావి స్తోంది. ఏ ప్రభుత్వంతో గానీ, సంస్థలతో గానీ,దేవాలయాలతో గానీ వ్యాపా ర లావా దేవీలు నిర్వహించకూడదు అన్నది హెరిటేజ్ సంస్థ పాలసీ. తిరుమల లడ్డూ వివాదాల్లోకి హెరిటేజ్ సంస్థను తేవడం వైసీపీ కుట్రల్లో ఒక భాగం.

## పేదల కర్మకాండలకు కంచి ఆర్థికసాయం



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** శ్రీ సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, నిత్యాన్నదాత కంచి పరమేశ్వరరెడ్డి తన ఉదారతను మరోసారి చాటుకున్నారు. మున్సిపాలిటీకే పరిమితమైన అంత్యక్రియల ఆర్థిక సహాయాన్ని ఇప్పుడు మండలంలోని రూరల్ గ్రామాలకు కూడా విస్తరించి, పేద కుటుంబాలకు అండగా నిలుస్తున్నారు. శనివారం 7మంది మృతుల కుటుంబాలకు 10వేల చొప్పున 70వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని చెక్కుల రూపంలో అందజేశారు. గ్రామీణ ప్రాంతంలోని దేపూరు ఎస్సీ కాలనీకి చెందిన కమతం వెంకట రమణమ్మ కుటుంబాన్ని, నువ్వూరుపాడులో మూరంరెడ్డి యానాదిరెడ్డి కుటుంబాన్ని, వాసిలి ఎస్సీ కాలనీకి చెందిన చీకటి హాజరతమ్మ కుటుంబాన్ని మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డుకు చెందిన ఉదయగిరి రమణమ్మ కుటుంబాన్ని 15వ వార్డుకు చెందిన ఏటూరి అనిల్ కుటుంబాన్ని, 19వ వార్డుకు చెందిన వలిడి అంకయ్య కుటుంబాన్ని, 23వ వార్డుకు చెందిన ఆత్మకూరు జయమ్మ కుటుంబాన్ని పరామర్శించి ఆయా కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయాన్ని అందజేయడం జరిగింది.గత రెండేళ్లుగా పట్టణ ప్రాంతానికే పరిమితమైన ఈ సేవను, గ్రామాల్లోని పేదల కష్టాలను గుర్తించి మండల వ్యాప్తంగా అమలు చేస్తున్నారు. ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు, వారి సహాయకులకు నిరంతర అన్నదాన కార్యక్రమం ద్వారా వేలమంది ఆకలి తీరుస్తున్నారు. కులమతాలకు అతీతంగా పేదరికమే ప్రాతిపదికగా, ఎటువంటి భేదాలు లేకుండా ప్రతి గడపకు వెళ్లి పరామర్శిస్తూ ధైర్యాన్ని నింపుతున్నారు. ఆర్థిక ఇబ్బందుల వల్ల ఎవరూ తమ వారి అంత్యక్రియలకు ఇబ్బంది పడకూడదనేదే తన సంకల్పమని కంచి పరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. దైవ సంకల్పంతో తాను చేస్తున్న సేవలు ఎంతో సంతృప్తినిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ఇంత పెద్ద ఎత్తున అన్నివర్గాలకు సేవాలందిస్తున్న పరమేశ్వరరెడ్డికి అందరూ కృతజ్ఞతలు తెలిపారు. ఆయన సేవలను కొనియాడారు.

## బుచ్చిలో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర ర్యాలీ




**బుచ్చిరెడ్డిపాలెం, మేజర్‌న్యూస్ :** స్వచ్ఛ ఆంధ్రబి స్వచ్ఛ దివస్ సందర్భంగా బుచ్చిరెడ్డిపాలెం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో శనివారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో మున్సిపల్ చైర్ పర్సన్ మోర్ల సుప్రజా మురళి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆదేశాల మేరకు ఈ ర్యాలీని చేపట్టినట్లు తెలిపారు. పట్టణంలోని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలందరూ సహకరించాలన్నారు. ఇళ్లలోని వ్యర్థపదార్థాలను వీధుల్లో, కాలువల్లో వేసి అపరిశుభ్రంగా మార్చవద్దని, దీంతో కాలువల్లోని మురుగునీటి ప్రవాహానికి అంతరాయం కలిగి ఆయా ప్రాంతాలు దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారుతాయన్నారు. తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరు డస్ట్ బిన్లలో వేసి తమ పారిశుద్ధ కార్మికులకు అందజేయాలని కోరారు. ఈ మేరకు పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేలా చైర్ పర్సన్ ప్రతిజ్ఞ చేయించారు. స్థానిక జొన్నవాడ రోడ్డు సెంటర్ నుండి మున్సిపల్ కార్యాలయం వరకు సాగిన ఈ ర్యాలీలో మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ, కౌన్సిలర్లు కత్తి నాగరాజు, రాచూరి సత్యం, తాళ్ళ వైష్ణవి, కో ఆప్షన్ సభ్యులు దస్తగిరి, ఏఈ వెంకటేష్, మెప్మా సిఓ నర్మద, మెప్మా సిబ్బంది, సచివాలయ సిబ్బంది, శానిటేషన్ సిబ్బంది, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## కలుషిత పర్యావరణంతో ప్రాణాలకే ముప్పు



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** స్వచ్ఛాంధ్ర –స్వర్ణాంధ్ర కార్యక్రమంలో బాగం గా ఇనమడుగులోని హైస్కులు నందు పర్యావరణం గురించి అవగాహ నా కార్యక్రమం డా కరుణాకర్ నిర్వహించి విద్యార్ధులు, స్టాఫ్‌తో స్వచ్ఛాం ధ్ర ప్రతిజ్ఞ చెపించడము జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ.. పర్యావణంను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి మీద ఉందని, నిర్లక్ష్యం వహించకుండా ప్రతి ఒక్కరు బాధ్యతగా మెలగాలని లేదంటె కాలుష్య వాతావరణంతో రోగాలు ప్రబలి మనిషి ప్రాణాలకు ముప్పు తప్పదని చెప్పారు ఇప్పుడు వస్తున్న రోగాలలో ఏక్కువ శాతం పర్యవరణానికి లింకు కలిగి ఉన్నాయని జీరో లిట్టర్ గవర్నెన్స్ ద్వార పర్యావరణశుద్ధితోపాటు ఆహ్లాదకరమైన వాతవరణములో ప్రశాంతమైన జీవనానికి నాంది అవుతుందన్నారు అలానె ఇనమడుగు హోమియోవైద్య శాల పరిసరాలను శుభ్రము చెయ్యడము జరిగింది. ఇంకా విధ్యార్ధులం దరికి పరీక్షలు సమీపిస్తున్నవేళ ఆరోగ్యము గురించి తీసుకోవల్సిన జాగ్రత్తలను వివరించారు. తర్వాత అక్కడ ఉన్న విద్యార్ధులకు, స్టాఫ్ కి సీజనల్ హోమియోప్రివెంటివె మెడిసిన్‌ని ఇవ్వడము జరిగింది ఇందులో స్టాఫ్ బాషా రామక్రిష్ణ పాల్గొన్నారు.

## మేకపాటి గౌతంరెడ్డికి ఘన నివాళులు



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** స్థానిక వైసీపీ కార్యాలయంలో శనివారం దివంగత మాజీ మంత్రి మేకపాటి గౌతంరెడ్డి నాల్గో వర్ధంతి సందర్భంగా వైసీపీ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిం చారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. మంత్రిగా గౌతంరెడ్డి రాష్ట్ర ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారన్నారు. ఉదయగిరి లో గౌతంరెడ్డి పేరుతో ప్రభుత్వ వ్యవసాయ కళాశాల ఏర్పాటు చేసి ఎంతోమంది విద్యార్థులకు వ్యవసాయ విద్యను అందుబాటులోకి తీసుకొ చ్చారన్నారు. మెట్ట ప్రాంతాలైన ఉదయగిరి, ఆత్మకూరు నియోజకవర్గాల అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకు లు దస్తగిరిఅహ్మద్, అక్కి భాస్కర్ రెడ్డి, ఎంఎ సలీం, షంషీర్, చెన్నయ్య, జాఫర్మొహిద్దీన్, బాబు, గురవయ్య, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

## విజేతలకు బహుమతులు అందజేత

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మండలంలోని పుల్లాయపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భం గా తెలుగు ఉపాధ్యాయులు డాక్టర్ మల్లెంకొండయ్య విద్యార్థులకు వకృత్వ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాతృభాషా ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. అనంతరం పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బంగారు పతకాలు అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు గాజులపల్లి సుబ్బారెడ్డి, ఉపాధ్యా యులు నరసయ్య, ప్రశాంతకుమారిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ అవగాహన ర్యాలీ




**వింజమూరు, మేజర్‌న్యూస్ :** పట్టణంలో ప్రధాన రహదారిలో శనివారం డ్రగ్స్ అవగాహన ర్యాలీని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు నిర్వహించారు. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్లకార్డులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ప్రధాన ఉపాధ్యాయులు మాలకొండయ్య మాట్లాడుతూ.. యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలన్నారు. మత్తు పదా ర్థాలు జీవితాలను నాశనం చేస్తాయన్నారు. ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. మత్తు పదార్థాలు సేకరించిన వారి పట్ల సమాజం కుటుంబం చులకన భావంతో ఉంటుంద న్నారు. కావున యువకులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## విజయ డైరీ డైరెక్టర్ కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ



**బుచ్చిపాళెలం, మేజర్‌న్యూస్ :** విజయ డైరీ డైరెక్టర్ గోళ్ళ సుధాకర్, టిడిపి నాయకులు గోళ్ళ సుదర్శన్‌ల కుటుంబ సభ్యులను కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంత్‌రెడ్డి శనివారం పరామర్శించారు. వారి మాతృమూర్తి నాగమ్మ మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మండలంలోని దామరమడుగు గ్రామంలో గల వారి నివాసానికి వెళ్లి నాగమ్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను ఓదార్చి, తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఎమ్మెల్యేతో పాటు టిడిపి మండల అధ్యక్షులు బెజవాడ జగదీష్, దామరమడుగు టిడిపి అధ్యక్షులు శేష కుమార్, కార్యదర్శి మస్తాన్, చేనేత సంఘం నాయకులు కే వి శేషయ్య తదితరులు ఉన్నారు.

# బీసీల పక్షాన నిలబడేది ఏకైక పార్టీ బీసీవై

- రాష్ట్రంలో పెను మార్పులు రానున్నాయి..
- బడుగు బలహీన వర్గాలకు అండగా బోడే రామచంద్ర యాదవ్
- నేడు గుంటూరు జరిగే బీసీవై సింహ గర్జన విజయవంతం చేయండి
- బీసీవై పార్టీ జిల్లా అధ్యక్షులు బుధవరపు బాలాజీ



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** బీసీల పక్షాన నిలబడేది ఏకైక పార్టీ బీసీవై అని, రాష్ట్రంలో పెను మార్పులు రానున్నాయని, బడుగు బలహీన వర్గాలకు అండగా బోడే రామచంద్ర యాదవ్ ఉన్నారని, నేడు గుంటూరు జరిగే బీసీవై సింహ గర్జన విజయవంతం చేయాలని బీసీవై పార్టీ జిల్లా అధ్యక్షులు బుధవరపు బాలాజీ అన్నారు నెల్లూరు నగరంలోని శోధన నగర్ నందు గల మన హాస్పిటల్‌లో శనివారం బీసీవై పార్టీ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ.. డిసెంబర్ 4వ తేదీ విజయవాడలో బీసీల రౌండ్ టేబుల్ సమావేశం బోడె రామచంద్ర యాదవ్ ఆధ్వర్యంలో అన్ని బీసీ సంఘాల నాయకులు, కుల సంఘ నాయకులు మేధావి వర్గం వారు ప్రజా సంఘ నాయకుల ఆధ్వర్యంలో అందరూ అభిప్రాయాలు తీసుకొని బీసీ సింహగర్జన కార్యక్రమాన్ని ఫిబ్రవరి 22వ తేదీ నిర్ణయాన్ని అందరి అభిప్రాయంతో బీసీవై పార్టీ జాతీయ అధ్యక్షులు బోడె రామచంద్ర యాదవ్ ప్రకటన చేశారు. ఈ యొక్క బీసీ సింహ గర్జన కార్యక్రమాన్ని నెల్లూరు జిల్లాలో అన్ని నియోజకవర్గాలలో మండలాల్లో గ్రామాలలో ఉండే బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీ మరియు మిగతా వర్గాల నాయకులను కుటుంబాలను గత 15 రోజులుగా విస్తృతంగా జిల్లాలో పర్యటించి ప్రతి ఒక్క వర్గాన్ని ప్రజలను కరపత్రాలు అందజేసి వీధి సమావేశాలు నిర్వహించి అందరిని ఆహ్వానించడం జరిగింది. అన్ని వర్గాల ప్రజలు ఈ కార్యక్రమానికి స్వచ్ఛందంగా వచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేస్తామని గత 79 సంవత్సరాల స్వతంత్ర భారతంలో రాజకీయ పార్టీలు ప్రభుత్వాలు బీసీలను బహుజనులను ఓటు బ్యాంకుగా చూశారా తప్ప బడుగు బలహీన వర్గాలకు ఎటువంటి రాజ్యాంగపరంగా సంక్రమించిన హక్కులను పొందే అవకాశాలు కల్పించలేదు. ఇలాంటి పరిస్థితుల్లో బీసీల కోసం ఒక గొప్ప మహోన్నత వ్యక్తి పోరాట యోధుడు నిరంతరం ప్రజా సమస్యల మీద న్యాయమైన పోరాటాలు చేస్తున్న బోడే రామచంద్ర యాదవ్ బడుగు బలహీన వర్గాలకు అండగా నిలిచారని బాలాజీ రాష్ట్ర వెనకబడిన వర్గాల అందరికీ తెలియజేశారు. రేపు జరగబోయే కార్యక్రమాన్ని అన్ని వర్గాల ప్రజలు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వారు నాగార్జున యూనివర్సిటీ క్యాంపస్ ఎదురుగా అంబేద్కర్, పూలే, మండల్, కర్పూరి ఠాగూర్ ప్రాంగణం నందు జరిగే బీసీ సింహగర్జన జయప్రదం చేయాలని కోరారు. ఈ యొక్క కార్యక్రమంలో బీసీవై పార్టీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్లు వేల్పుల రామ్మోహన్ యాదవ్, సోమ గోపాల్ పద్మశాలి, రాష్ట్ర యూత్ కో కన్వీనర్లు లీలా కృష్ణ యాదవ్, తిప్పిర బోయిన రమేష్ యాదవ్, జిల్లా యూత్ కోకన్వీనర్ కొణిదెల నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## చాకలి కొండ గ్రామంలో వీపీఆర్ నేత్ర వైద్య శిబిరం




**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరు మండలం చాకలికొండ గ్రామంలో శనివారం విపిఆర్ నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు ఈ శిబిరం స్థానిక సర్పంచ్ ఉప్పిరెట్ల సుబ్బలక్ష్మి కుమారి వింజమూరు మండల తెలుగుదేశం పార్టీ కన్వీనర్ గూడా నర్సారెడ్డి స్థానిక సీనియర్ నాయకులు కూనల వెంకటేశ్వర్లు మబ్బు బుచ్చయ్య గడ్డం రమణారెడ్డి క్లస్టర్ ఇన్‌చార్జ్ బోడేపూడి వీరభద్రయ్య నెల్లూరు తెలుగుదేశం పార్లమెంటరీ అధికార ప్రతినిధి శ్రీనివాస్ రెడ్డి ఎన్నపల్లి పెంచలరావు లు శిబిరాన్ని సందర్శించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విపిఆర్ దంపతులు పేద ప్రజల కంటి సమస్యలను నివారించేందుకు ఈ బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టారని తెలిపారు పేద ప్రజలు దూరప్రాంతాలకు వెళ్లి థాంక్యూ చేయించుకునేందుకు కష్టంగా ఉంటుందని ఉద్దేశంతో ప్రజల దగ్గరికి కంటి వైద్యాన్ని తీసుకొచ్చి కంటి చూపులు ప్రసాదించిన మహానుభావులని పేర్కొన్నారు వారి పుణ్యంతోనే కంటి సమస్యలు ఉన్నవారు ఎంతో సంతోషాన్ని పొందుతున్నారని తెలిపారు. భవిష్యత్తులో మరెన్నో ప్రజాసేవ కార్యక్రమాలను నిర్వహించి ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలవాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు బిపిఆర్ నేత్రమొబైల్ వాహన సిబ్బంది గ్రామ పెద్దలు తదితరులు ఉన్నారు.

## ఘనంగా దివంగత మేకపాటి గౌతమ్ రెడ్డి వర్ధంతి

**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రమైన ఏఎస్ పేట బస్టాండ్ సెంటర్ లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దివంగత మంత్రి, మేకపాటి గౌతంరెడ్డి నాలుగవ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆత్మకూరు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు మేకపాటి.విక్రమ్ రెడ్డిఆదేశములమేరకు ఏఎస్.పేట మండల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ పందిళ్ళపల్లి సుబ్బారెడ్డి, ఏఎస్.పేట మండల జడ్పిటిసి సభ్యురాలు పందిళ్లపల్లి రాజేశ్వరమ్మ సూచనల మేరకు జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీ పులిమి వెంకట రమేష్ రెడ్డి ఆధ్వర్యంలో కీర్తిశేషులు, స్వర్గీయ మేకపాటి గౌతమ్‌రెడ్డి వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత రాష్ట్ర దివంగత ముఖ్యమంత్రి స్వర్గీయ వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించిన తరువాత, మేకపాటి గౌతంరెడ్డి చిత్రపటంకు, ఇటీవల మరణించిన ఏఎస్.పేట మండల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కాటూరి జనార్ధన్‌రెడ్డి చిత్రపటంకు పూలమాలలు వేసి, పూలతో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా నివాళులర్పించారు. ఈ



కార్యక్రమంలో నియోజకవర్గ మైనారిటీ అధ్యక్షులు మండల కోఆప్షన్ సభ్యులు సయ్యద్ సందానిభాష వైఎస్ఆర్సిపి మండల నాయకులు ఏ కోటిరెడ్డి సూరా శ్రీనివాసులు రెడ్డి అయితా వెంకటేశ్వర్లు గూడ భాస్కర్ రెడ్డి పఠాన్ ఖాదర్ రంగారెడ్డి ప్రజా ప్రతినిధులు, ఏఎస్ పేట మండలంలోని, అన్నీ గ్రామ పంచాయతీల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు భారీగా పాల్గొన్నారు.

## మేకపాటి గౌతమ్ రెడ్డి వర్ధంతి



**అనంతసాగరం, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రమైన అనంతసాగరంలోని ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే, దివంగత మంత్రి మేకపాటి గౌతంరెడ్డి వర్ధంతి శనివారం ఘనంగా జరిగింది. తొలిత వైయస్సార్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం దివంగత మంత్రి మేకపాటి గౌతంరెడ్డి విగ్రహానికి నాయకులు పూలు జల్లి నివాళులర్పించారు. జోహార్ గౌతమ్ రెడ్డి, మేకపాటి విక్రంరెడ్డి నాయకత్వం వర్ధిల్లాలి నినాదాలు చేశారు. ఆయన లోటు తీర్చలేనిదని ఆయన ఆశయ సాధన కోసం ఎల్లవేళలా కృషి చేస్తామని ఎద్దుల శ్రీనివాస్ రెడ్డి, అక్కుల రెడ్డి అంకిరెడ్డి, బట్రెడ్డి జనార్దన్ రెడ్డి, బట్రెడ్డి నాగేంద్ర రెడ్డి, సిద్ధన పెంచలరెడ్డి తెలిపారు.

## ఎస్పీబీవీడీ డిగ్రీ కాలేజి విద్యార్థుల విజయభేరి



**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** పొదలకూరు పట్టణంలో విక్రమ సింహపురి యూనివర్సిటీ శుక్రవారం విడుదల చేసిన డిగ్రీ 3,5 సెమిస్టర్ల పరీక్షా ఫలితాలలో ఎస్పీబీవీడీ డిగ్రీ కళాశాల విద్యార్థులు విజయభేరీ మోగించారు. సాయి విద్యానికేతన్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న డిగ్రీ విద్యార్థులు బీకాం కంప్యూటర్స్, బీసీఏ గ్రూపులలో మండల ప్రథమ స్థానాలను కైవసం చేసుకున్నారు. డిగ్రీ ఫైనల్ ఇయర్ ఐదవ సెమిస్టర్ బీకాం కంప్యూటర్స్ గ్రూప్‌కు సంబంధించి టి.ప్రశాంతి 8.98 పాయింట్లతో, బీసీ ఏ గ్రూప్‌లో కే.మల్లిక 8.84 పాయింట్లతో పొదలకూరు మండల ప్రథమ స్థానాలను దక్కించుకున్నారు. అలాగే డిగ్రీ సెకండ్ ఇయర్ మూడవ సెమిస్టర్ బీకాం కంప్యూటర్స్ గ్రూప్‌కు సంబంధించి కె.చందన 8.66 పాయింట్లతో మండల ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. అలాగే ఎక్కువ మంది విద్యార్థులు అధిక జీపీఏతో ఉత్తీర్ణత సాధించారు. ఇంతటి ఘనవిజయం సాధించిన విద్యార్థులను ఎస్వీఎన్ విద్యా సంస్థల చైర్మన్ బి.వెంకటేశ్వర్లు, మేనేజింగ్ డైరెక్టర్ టి.నరేంద్ర రెడ్డిలు అభినందించారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కాలేజి ప్రిన్సిపాల్ కె.కోటేశ్వరరావు, ఇంటర్ ప్రిన్సిపాల్ జీవి రామానాయుడు, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## చలివేంద్రంలో పారిశుధ్య నిర్వహణ ప్రచారం




**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** అదానీ కృష్ణపట్నం పోర్ట్ లిమిటెడ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ జగదీష్ పటేల్ ఆదేశాలు మేరకు శనివారం అదానీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ముత్తుకూరు గ్రామ పచాయత్‌లోని చలివేంద్రం గ్రామంలో పారిశుధ్య నిర్వహణ ప్రచారాన్ని నిర్వహించారు, గ్రామ పారిశుధ్యాన్ని మంచి పద్ధతిలో నిర్వహించాలి అనే అంశం పైన గ్రామస్తులతో పాటు వార్డు సభ్యులు ఉపాధ్యాయులు ప్రచారానికి హాజరై తెలియజేశారు. ఇంటి పరిసరాలు, గ్రామ వీధులు రోడ్లను శుభ్రంగా ఉంచడం, చెత్త విస్మరించిన వస్తువులను గ్రామానికి దూరంగా ఒకే చోట నిల్వ ఉంచడం గురించి వివరించారు. అదానీ అదానీ ఫౌండేషన్ సిఎస్ఆర్ బృందం ద్వారా చలివేంద్రం గ్రామస్తులను మేల్కొలిపి గ్రామ పారిశుధ్య ప్రచారాన్ని కొనసాగించడంలో అదానీ కృష్ణపట్నం పోర్ట్ లిమిటెడ్ అదానీ ఫౌండేషన్‌కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## రిలే నిరాహారదీక్షల నోటీసు అందజేత



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** ఈనెల 23 నుంచి 27వ తేదీ వరకు అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర కమీటీ పిలుపు మేరకు స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట చేపట్టే అంగన్వాడీల రిలే నిరాహారదీక్షల ముందస్తు నోటీసును శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో యూనియన్ నాయకులు సీడీపీవో పుణ్యవతికి అందజేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ప్రస్తుతం జరుగుతున్న బడ్జెట్ సమావేశాల్లో అంగన్వాడీల వేతనాల పెంపు, మినీ కేంద్రాలను మెయిన్ కేంద్రాలుగా మార్పు చేయడం. సంక్షేమ పథకాల అమలు తదితర సమస్యల పరిష్కారం కోరుతూ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. రిలే నిరాహారదీక్షల అనంతరం మార్చి 2న విజయవాడలో మహాధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ, యూనియన్ నాయకులు షేక్ నాయబ్ రసూల్, ప్రమీల, విజయకుమారి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

# త్రిబుల్ ఆర్ పై ప్రజలకు అవగాహన కల్పించండి : కమిషనర్




**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతినెల 3వ శనివారం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'స్వచ్ఛ ఆంధ్ర – స్వర్ణ ఆంధ్ర' కార్యక్రమంలో భాగంగా నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వైఓ నందన్ స్థానిక విఆర్ మున్సిపల్ హై స్కూల్ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈనెల 'జీరో వేస్ట్ లిట్టర్ గవర్నెన్స్' అన్న అంశంపై నిర్వహించిన ఈ కార్యక్రమాలలో భాగంగా కమిషనర్ 'స్వచ్ఛ ఆంధ్ర – స్వర్ణాంధ్ర' ప్రతిజ్ఞను అందరితో చేయించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. తడి పొడి చెత్తను విడిగా సేకరించడం ద్వారా మాత్రమే వాటిని కంపోస్ట్ చేయగలమని, చెత్త సేకరణ వాహనాలకు వ్యర్థాలను అందించేటప్పుడు ప్రతి ఒక్కరు తప్పనిసరిగా ఈ నియమాన్ని పాటించాలని సూచించారు. వ్యర్థాలను రీసైక్లింగ్ చేసే ఉన్నతమైన ఆలోచనలపై ప్రజలందరికీ అవగాహన కల్పించి పర్యావరణ పరిరక్షణకు అందరూ కృషి చేయాలని కమిషనర్ సూచించారు. అనంతరం స్థానిక పాత మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన 'స్వచ్ఛ్ ఆంధ్ర – స్వర్ణాంధ్ర' అవగాహన కార్యక్రమంలో కమిషనర్ పాల్గొని కార్యక్రమ నిర్వహణ తీరును పరిశీలించారు. 'రెడ్యూస్ – రీ యూజ్ – రీ సైకిల్' అన్న అంశంపై ప్రజలందరికీ అవగాహన కల్పించాలని, విద్యుత్ వాహనాల వాడకాన్ని ప్రోత్సహించాలని కమిషనర్ తెలిపారు. ప్రతిరోజూ జీవితంలో ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించుకోవాలని, వ్యర్థాలను తగలబెట్టరాదని కమిషనర్ సూచించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఓ.దినేష్, ఇంజనీరింగ్ విభాగం ఎస్ఈ రహంతు జానీ, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## సౌత్ మోపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** సౌత్ మోపూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కుష్టు ఎయిడ్స్, క్షయ అధికారి డాక్టర్ ఖాదరవలి తనిఖీ చేసి,ఆరోగ్య కార్యక్రమాల పనితీరును సమీక్ష చేయడం జరిగింది. ఈ సమీక్షలో వ్యాధి నిరోధక టీకాలు, ఎస్ఏఏ ఎన్ఎస్, టీబి కేసుల వివరాలు, లెప్రసీ కేసులు వివరాలు, ల్యాబ్ టెస్టుల వివరాలు, ఫార్మసీకి సంబంధించిన వివరాలు, ఒపీ, ఐపీ రిజిస్ట్రేషన్ వివరాలు పైన క్షుణ్ణంగా పరిశీలించి, సిబ్బందికి తగు సూచనలు ఇవ్వటం జరిగింది. తదుపరి స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మరుగుదొడ్లను పరిశీలించారు. సమీక్షలో వైద్యాధికారి డాక్టర్ ఆర్షద్, ఎంపిహెచ్ఈఓ పెంచలయ్య, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ బట్టేపాటి అశోక్, ఫార్మసీ ఆఫీసర్ శేఖర్, స్టాఫ్ నర్స్ రేవతి, ఎల్డి కంప్యూటర్ శైలశ్రీ తదితరులు పాల్గొన్నారు.

## పనులు సకాలంలో పూర్తి చేయాలి : కమిషనర్



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వైఓ నందన్ పారిశుధ్య నిర్వహణ పనుల పర్యవేక్షణలో భాగంగా స్థానిక వాహబ్ పేట, ఉమామహేశ్వరి శివాలయం ప్రాంతంలో జరుగుతున్న యెల్లి కాలువ అభివృద్ధి పనులను శనివారం అధికారులతో కలిసి పరిశీలించారు. కాలువ నిర్మాణ పనులను నిర్దేశించిన సమయంలోపు పూర్తి చేయాలని, పనులు నాణ్యతతో జరిగేలా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం ఎస్ఈ రహంతు జానీ, ఇరిగేషన్ విభాగం అధికారులు, వార్డు సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మర్రిపాడులో ఘనంగా గౌతంరెడ్డి వర్ధంతి వేడుకలు



**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** మర్రిపాడు మండల కేంద్రం స్థానిక వైసిపి కార్యాలయం నందు శనివారం దివంగత మాజీ మంత్రి మేకపాటి గౌతం రెడ్డి వర్ధంతి వేడుకలను వైసీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ముందుగా నాయకులు ర్యాలీగా బయలుదేరి దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మేకపాటి గౌతంరెడ్డి చిత్రపటానికి పూలమాలలు సమర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా మండల వైసీపీ నాయకులు మాట్లాడుతూ మేకపాటి గౌతంరెడ్డి ప్రజల మధ్య పెరిగి, ప్రజల కోసమే జీవించిన నిజమైన ప్రజానాయకుడని స్మరించుకున్నారు. పరిశ్రమలు, ఉపాధి అవకాశాల కోసం కృషి చేసి యువతకు ఆశాకిరణంగా నిలిచారని తెలిపారు. ఎల్లప్పుడూ సరళ స్వభావంతో అందరికీ అందుబాటులో ఉండి ప్రజల సమస్యల పరిష్కారానికి కట్టుబడి పనిచేసిన నాయకుడని కొనియాడారు. నియోజకవర్గ ప్రజల ముద్దుబిడ్డగా ఆయన పేరు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతుందని, ఆయన ఆశయ సాధన కోసం కట్టుబడి ముందుకు సాగుతామన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైసీపీ కన్వీనర్ చిన్ను వెంకటేశ్వర రెడ్డి, మాజీ మండల కన్వీనర్ గంగవరపు శ్రీనివాసులు నాయుడు, ఏపిలగుంట ఎంపీటీసీ హాజరత్ రెడ్డి, మండల యూత్ నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి, మండలం మాజీ వైసిపి కన్వీనర్ బొర్ర సుబ్బిరెడ్డి, బిసి సెల్ అధ్యక్షులు నాగరాజు, ఎస్సీ సెల్ అధ్యక్షులు రామకృష్ణ, విజయ్, గౌస్ బాషా, సుధాకర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ తలశిల రఘురామ్‌ని పరామర్శించిన ఆనం



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** శాసనమండలి సభ్యులు తలశిల రఘురామ్ తండ్రి స్వర్గీయ తలశిల చంద్రశేఖర్ రావు ఇటీవల స్వర్గస్తులైనందువలన శనివారం విజయవాడ, గొల్లపూడిలోని తలశిల రఘురామ్ నివాసానికి వెళ్లి తలశిల రఘురామ్‌ని పరామర్శించి, స్వర్గీయ చంద్రశేఖర్ రావుకి చిత్రపటానికి తిరుపతి పార్లమెంట్ సభ్యులు డాక్టర్ గురుమూర్తితో కలిసి వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు రూరల్ మండలం అధ్యక్షుడు పుచ్చలపల్లి రామ్ ప్రసాద్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యులు చెన్నారెడ్డి ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.

## అవార్డు గ్రహీతకు ఘన సన్మానం



**కలిగిరి, మేజర్‌న్యూస్ :** 77వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జిల్లా స్థాయిలో ప్రకటించిన 'ఉత్తమ సేవా పురస్కారం'ను కలిగిరి మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ-2) గోళ్ల సురేష్ అందుకున్నారు. ఈ అవార్డును నెల్లూరు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల చేతుల మీదుగా స్వీకరించారు. ఈ శుభసందర్భాన్ని పురస్కరించుకుని శనివారం తెల్లపాడు హై స్కూల్ ప్రాంగణంలో తెల్లపాడు క్లస్టర్ చైర్మన్ల మరియు ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు ఆధ్వర్యంలో గోళ్ల సురేష్‌కు ఘన సన్మానం నిర్వహించారు. శాలువా కప్పి, జ్ఞాపిక అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈఓ గోళ్ల సురేష్ మాట్లాడుతూ.. ప్రభుత్వం అందించిన ఈ గుర్తింపు తనపై మరింత బాధ్యతను ఉంచిందని, మండలంలోని విద్యా ప్రమాణాల పెంపు కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. ఉపాధ్యాయుల సమన్వయంతో విద్యార్థుల అభివృద్ధి లక్ష్యంగా పని చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, క్లస్టర్ చైర్మన్లు పాల్గొన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెచ్‌డీఎస్ కమిటీ సమావేశం




**కలిగిరి, మేజర్‌న్యూస్ :** కలిగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీ (హెచ్‌డీఎస్) కమిటీ సమావేశం హెచ్‌డీఎస్ కమిటీ చైర్మన్ మెట్టుకూరు శిరీష అధ్యక్షతన నిర్వహించారు. కమిటీ సభ్యులు పాల్గొన్న ఈ సమావేశంలో ఆసుపత్రి అభివృద్ధి, వైద్య సేవల మెరుగుదలపై విస్తృతంగా చర్చించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని, ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా సేవలు కొనసాగించాలని వైద్యాధికారులకు చైర్మన్ సూచనలు చేశారు. ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలపై సంతృప్తి వ్యక్తం చేస్తూ, భవిష్యత్తులో మరింత మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పీజీ గైనకాలజీ సీటు పొందిన వైద్యాధికారిణి డాక్టర్ బిజ్జం గీతారెడ్డిని ఎంపీపీ శిరీష, ఎంపీడీఓ కె.ప్రత్యూష, రావులకొల్లు సర్పంచ్ పూసాల వెంగప నాయుడు, వై.సతీష్ జిర్రావారిపాలెం, వెలగపాడు, కుమ్మర కొండూరు గ్రామపంచాయతీల సర్పంచ్‌లు శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కలిగిరి మండల అభివృద్ధి అధికారి కె.ప్రత్యూష, పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ బిజ్జం గీతారెడ్డి, డాక్టర్ ఆకాష్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

## పలు గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరం



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** నాలుగు గ్రామాల ప్రజలకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశామని తద్వారా 176 మందికి వైద్య ఆరోగ్య పరీక్షలు చేసామని అదానీ కృష్ణపట్నం పోర్టు లిమిటెడ్, అదాని ఫౌండేషన్ సంయుక్తంగా శనివారం తెలిపింది. దొరువులపాళెం గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణంలో నిర్వహించిన వైద్య శిబిరంలో కంటి, ఈ ఎన్ టి, సాధారణ వ్యాధులకు సంబంధించి నెల్లూరు అపోలో హాస్పిటల్ వైద్య బృందం ఉచితంగా వైద్యం అందించినట్లు ఫౌండేషన్ తెలిపింది. సామాజిక సేవ కార్యక్రమాలలో భాగంగా వైద్య శిబిరం ఏర్పాటు అయినట్లు పేర్కొన్నారు

# 2029 ఎన్నికల్లో మేకపాటి విక్రమ్ రెడ్డి విజయం తథ్యం

## వైసీపీ మండల కన్వీనర్ పిచ్చిరెడ్డి

**అనంతసాగరం, మేజర్‌న్యూస్ :** కీర్తిశేషులు ఆత్మకూరు నియోజకవర్గం ఎమ్మెల్యే, దివంగత మంత్రి మేకపాటి గౌతంరెడ్డి ఆశయాలు సాధించాలంటే మాజీ శాసనసభ్యులు విక్రంరెడ్డితోనే సాధ్యమని, 2029 అసెంబ్లీ ఎన్నికల్లో ఆత్మకూరు నియోజకవర్గంలో మేకపాటి విక్రమ్‌రెడ్డి విజయం తధ్యమని మండల వైకాపా కన్వీనర్ బిజివేముల పిచ్చిరెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రమైన అనంతసాగరంలో మేకపాటి గౌతమ్‌రెడ్డి వర్ధంతి ఘనంగా జరిగింది. అనంతసాగరం గ్రామంలోని ఎస్టీ కాలనీలో పేద ప్రజలకు గౌతమ్ రెడ్డి వర్ధంతి పురస్కరించుకొని అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైకాపా మండల కన్వీనర్ పిచ్చిరెడ్డి మాట్లాడుతూ.. గౌతమ్ రెడ్డి వర్ధంతి పురస్కరించుకొని సేవా కార్యక్రమంలో భాగంగా ఎస్టీ కాలనీ ప్రజలకు అన్నదానం ఏర్పాటు చేశామన్నారు. 2029 అసెంబ్లీ ఎన్నికల్లో మేకపాటి విక్రంరెడ్డి విజయం సాధించి జగన్ మంత్రివర్గంలో చోటు దక్కుతుందని ఆత్మకూరు అభివృద్ధికి విక్రమ్ రెడ్డి బాటలు వేస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పి.సంపూర్ణమ్మ, ఆంధ్ర ప్రదేశ్ వైయస్సార్




కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యాయ సంఘం ఉపాధ్యక్షులు మెట్టుకూరు సుబ్బారెడ్డి, నెల్లూరు జిల్లా వైకాపా యాక్టివిటీ కార్యదర్శి బట్రెడ్డి జనార్ధన్ రెడ్డి, వైకాపా నాయకులు అక్కల రెడ్డి అంకిరెడ్డి, ఎద్దుల శ్రీనివాసులు రెడ్డి, కేత రవీంద్రారెడ్డి, సడ్డ రవీంద్రారెడ్డి, పాలెం మధుసూదన్ రెడ్డి, ముక్కు మస్తాన్ గౌడ్, బొమ్మవరం గ్రామ సర్పంచ్ లక్ష్మీదేవి, అనంతసాగరం మండలం వైకాపా క్రిస్టియన్ సంఘం అధ్యక్షులు కోడి నాగశేషు, మండల వైకాపా యువజన అధ్యక్షులు బట్రెడ్డి నాగేందర్‌రెడ్డి, మేకపాటి అభిమానులు, జగన్ అభిమానులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పాల్గొన్నారు.

## బద్దెవోలు సర్పంచ్‌కి పితృవియోగం

**మనుబోలు, మేజర్‌న్యూస్ :** బద్దెవోలు సర్పంచ్ ఉగ్గుముడి శశిరెడ్డి తండ్రి రామిరెడ్డి(80) అనారోగ్యంతో శనివారం చనిపోయారు. ఈ సమాచారంతో మాజీ మంత్రి వైసిపి



జిల్లా అధ్యక్షుడు కాకాని గోవర్ధన్ రెడ్డి శనివారం బద్దెవోలు వచ్చిసర్పంచ్ శశిరెడ్డిని పరామర్శించారు. ఆయన రామిరెడ్డి పార్ధీవదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం శశి కుమార్ రెడ్డిని ఓదార్చారు. తన ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశి నివాళులు అర్పించారు. అయన వెంట వైసిపి మండల కన్వీనర్ బొమ్మిరెడ్డి హరగోపాల్‌రెడ్డి కడివేటి చంద్రశేఖర్‌రెడ్డి దాసరి భాస్కర్ గౌడ్ ఉగ్గుమూడి గోపీనాథ్‌రెడ్డి, బి.బాలకృష్ణారెడ్డి ముంగర రవీందర్‌రెడ్డి సన్నారెడ్డి జానకిరామ్‌రెడ్డి ఆవుల తులసీరామ్ యాదవ్ గుండాల ఆదినారాయణ ధనుంజయ రెడ్డి కనిమేల మల్లికార్జున్ బద్వేలు కృష్ణయ్య గురిందిపూడి మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పరీక్షల మెటీరియల్



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరులోని ఏడవ వార్డు కౌన్సిలర్ నౌషాద్ బేగం ఆధ్వర్యంలో పదవ తరగతి పిల్లలకు ప్యాడ్లు పెన్నులు పంపిణీ చేశారు. శనివారం దివంగత మంత్రి మేకపాటి గౌతంరెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన జ్ఞాపకార్థం ఈ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఏటా వారు గౌతంరెడ్డి సంస్మరణార్థం ప్రత్యేకంగా స్వంత నిధులతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. ఈ కార్యక్రమంలో ఏడవ వార్డు వైసిపి నాయకులు సయ్యద్ జమీర్ భాష, మునీర్ భాష హెచ్‌ఎం ఫయాజ్ ఫయాజుద్దీన్ ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## కుంభాభిషేకంలో పాల్గొన్న ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** ఇందుకూరుపేట మండల కేంద్రంలో వెలసిన శ్రీ ఇందుపూరమ్మ, దేశమ్మ అమ్మవార్ల ఆలయంలో నిర్వహించిన మహా కుంభాభిషేక మహోత్సవంలో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. భక్తుల కోలాహలం మధ్య అత్యంత వైభవంగా జరిగిన మహా అమ్మవార్ల కుంభాభిషేక మహోత్సవంలో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అత్యంత సుందరంగా ఆలయాన్ని నిర్మించిన కమిటీ సభ్యులను ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. ఇంతటి మహత్కార్యాన్ని భుజాన వేసుకుని ఉత్సవాలను వైభవంగా నిర్వహించిన సభ్యులందరిపై అమ్మవారి ఆశీస్సులు నిరంతరం ఉండాలని ఆమె ఆకాంక్షించారు. ఆలయాల నిర్మాణం ఎంత ముఖ్యమో వాటి నిర్వహణ



కూడా అంతే ముఖ్యమని ఆమె పేర్కొన్నారు. ఆగమ శాస్త్రం ప్రకారం శాస్త్రోక్తంగా నిత్య కైంకర్యాలు జరిగేలా చూడటం ద్వారానే ఆలయాలకు ఆధ్యాత్మిక శోభ చేకూరుతుందని ఆమె కమిటీకి సూచించారు. ఇందుపూరమ్మ, దేశమ్మతల్లి దీవెనలతో ఇందుకూరుపేట గ్రామ ప్రజలందరూ పాడిపంటలతో, సుఖశాంతులతో సుభిక్షంగా ఉండాలని ఆమె ప్రార్థించారు. కార్యక్రమంలో ఇందుకూరుపేట మండల టిడిపి అధ్యక్షులు ఏకొల్లు పవన్ కుమార్ రెడ్డి, రాష్ట్ర మీవీజు డైరెక్టర్ రావెళ్ల నాయుడు, టిడిపి సీనియర్ నాయకులు దువ్వూరు కళ్యాణ్ రెడ్డి, కోడూరు కమలాకర్ రెడ్డి, నాగార్జున నాయుడు, రాంప్రసాద్ నాయుడు, లేబూరు వెంకటేశ్వర్లు, షేక్ ఇంతియాజ్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## పొదలకూరు శివాలయంలో హుండీ లెక్కింపు

**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** పట్టణంలో ఉన్న పురాతన శ్రీ కామాక్షితాయి సమేత రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో హుండీ లెక్కింపు కార్యక్రమం శనివారం నిర్వహించారు. దేవాదాయ శాఖ పర్యవేక్షణ




అధికారి పి.శ్రీనివాసులు, దేవస్థాన కార్యనిర్వహణాధికారి ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో లెక్కింపు ప్రక్రియ పారదర్శకంగా చేపట్టారు. మూడునెలల వ్యవధికి గాను ఆలయ హుండీలో మొత్తం రూ.86,453 ఆదాయం వచ్చినట్లు కార్యనిర్వహణాధికారి ప్రసాద్ రెడ్డి, ప్రధాన అర్చకులు ప్రసాద్ స్వామి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అసిస్టెంట్లు సుధాకర్, చరణ్, అర్చకులు కుమార స్వామి, గ్రామ పెద్దలు కోవూరు బక్కయ్య నాయుడు, కాసా శ్రీనివాసులు, చిర్రా రమణా రెడ్డి, సిబ్బంది కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పాడి పశువులకు ఎంత కష్టమో..!

*(మొదటి పేజీ తరువాయి)*

పరితపిస్తూ పరుగులు తీస్తున్న ఆవులను రహస్యంగా మాటువేసి రోప్‌ల (ఉచ్చులు)తో బంధిస్తున్న అక్రమార్కులు, దళారులు గుట్టుచప్పుడు కాకుండా అక్రమ రవాణాతో జిల్లాను దాటించి సొమ్ము చేసుకుంటున్న అనేక సంఘటన లు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. ఒకానొక దశలో కండ పుష్టితో బలంగా ఉన్న కోడెదూడలను సైతం పట్టుకొని బంధించే సాహ సం చేయలేని పలువురు పశువుల దొంగలు.. ఏకంగా ట్రాక్టర్ ఇంజన్ ముందుభాగంతో బలంగా ఢీ కొట్టించి.. అవి స్పృహ తప్పి పడిపోయిన వెంటనే పథకం ప్రకారం ముందుగా ఎంచుకున్న రహస్య స్థావరాలకు తరలించి, అక్కడ సిద్ధంగా ఉంచిన మినీ లారీలు, టాటా ఏసీ, ట్రక్ ఆటోలు తదితర వాహనాల్లో గ్రామ పొలిమేర్ల నుంచి మండల, మునిసిపాలిటీలనే కాకుండా ఏకంగా జిల్లా సరిహద్దులు దాటించి సొమ్ము చేసుకుంటున్న సంఘటనలు అనేకం ఉన్నాయి. ఇంత జరుగుతున్నా.. క్షేత్రస్థాయి కట్టడి చర్యలతో అడ్డుకోవాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తిన చందంగా వ్యవహరిస్తున్న తీరు పట్ల సర్వత్రా విమర్శలకు తావిస్తోంది.

## వైభవంగా స్వామి అమ్మవార్ల దవనోత్సవం

**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరం మూలాపేటలోని శ్రీ భువనేశ్వరి సమేత శ్రీ మూలస్థానేశ్వర స్వామి వారి దేవస్థానంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి దవనోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. స్వామి అమ్మవార్లకు దవణం (సుగంధ్ధాన్ని ఇచ్చే మొక్క)తో అందంగా అలంకరించారు. అనంతరం ఊరేగింపుపై స్వామి అమ్మవార్లు దర్శనమిచ్చారు. వేడుకలు ముగింపు



కార్యక్రమాలకు భక్తులు విశేషంగా తరలి వచ్చారు. భక్తులకు దేవస్తానం వారు తీర్థ ప్రసాదాలు అందచేశారు. ఈ వేడుకలు దేవస్థాన చైర్మన్ పుట్టా విజయ్ కుమార్‌రెడ్డి, కార్యనిర్వహణాధికారి వెంకట శ్రీనివాసులు రెడ్డి, ఆలయ సిబ్బంది ఆద్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన డిఎంహెచ్ఓ

**వరికుంటపాడు, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రమైన వరికుంటపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిఎంహెచ్ఓ డాక్టర్ సుజాత శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె పలు రికార్డులను పరిశీలించి సిబ్బందికి సూచనలు సలహాలు అందజేశారు. వైద్యం కోసం వచ్చిన పేషంట్లను వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. సిబ్బంది అందరూ వ్యాక్సినేషన్, నిర్దేశ సర్వేలను, రోజువారి కార్యక్రమాల పై అలసత్వం వహించరాదన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆయేషా, సిహెచ్వో రాజశేఖర్, సీసీ రామకృష్ణ, చంద్రమోహన్ రెడ్డి, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



## ఇంటర్ పరీక్షలకు సర్వంసిద్ధం

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** స్థానిక అల్తూరి రామిరెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం నుంచి ప్రారంభమై ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల పబ్లిక్ పరీక్షలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేసినట్లు చీఫ్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, డిపార్టుమెంట్ అధికారి చంద్రశేఖర్లు పేర్కొన్నారు. శనివారం స్థానిక పోలీసే స్టేషన్కు చేరిన సెట్-3 ప్రశ్నపత్రాలను సరి చూసుకొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ పరీక్షా కేంద్రంలో తమ కళాశాలతోపాటు పట్టణంలోని ప్రగతి, మేకపాటి వెంకురెడ్డి జూనియర్ కళాశాలల విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. 727 మంది విద్యార్థులకు పరీక్షలు హాజరు కానున్నారని తెలిపారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. విద్యార్థులు గంట ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలన్నారు. కేంద్రంలో అన్ని వసతులు కల్పించినట్లు తెలిపారు. ప్రశాంతంగా పరీక్షలు జరిగేలా ప్రతిఒక్కరు సహకరించాలన్నారు.



## వల్లూరు చెరువులో బాతుల కాపరి మృతి

**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** తోటపల్లి గూడూరు మండలం సౌత్ గ్రామానికి చెందిన ఉప్పు మస్తాన్ అనే బోతున్న కాపరి ముత్తుకూరు మండలంలోని వల్లూరు చెరువు నీటిలో పడి మృతి చెందినట్లు స్థానిక పోలీస్ శాఖ శనివారం తెలిపింది. మృతుడు తనతల్లి ఉప్పు వెంకమ్మతో కలిసి మన్యం గోపాల్ అనే వ్యక్తి వద్ద బాతులు కాపరిగా పనిచేస్తున్నారు. బాతులకు నీళ్లు పెట్టుకునేందుకు



చెరువు వద్దకు రాగా మద్యం మత్తులో నీటిలో బోర్లా పడి చనిపోయాడని పోలీస్ శాఖ అధికారులు తెలిపారు. పోలీస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు స్థానిక ఎస్ఐ ప్రసాద్ రెడ్డి మీడియాకు తెలిపారు.

## 23, 24న వీఎస్‌యూలో ఐఎస్ఓ ఆడిట్

**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** విక్రమ సింహపురి యూనివర్సిటీలో ఈనెల 23, 24 తేదీల్లో అంతర్జాతీయ ఐఎస్ఓ సర్వైలెన్స్, పునరుద్ధరణ ఆడిట్ నిర్వహించనున్నారు. హైదరాబాద్‌కు చెందిన హెచ్‌వైఎం ఇంటర్నేషనల్ సర్టిఫికేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు విద్యా, పరిపాలనా విభాగాలను పరిశీలించనున్నారు. విద్యా నాణ్యత, పర్యావరణ పరిరక్షణ, ఇంధన వినియోగ సమర్థతతో పాటు అకడమిక్, లింగ సమానత్వ అంశాలపై సమీక్ష జరుగుతుంది. ఈ గుర్తింపులు కొనసాగితే నాక్ గ్రేడ్ మెరుగుపడే అవకాశముందని వర్సిటీ వర్గాలు తెలిపాయి.

# రాష్ట్ర స్థాయిలో క్రీడల్లో సత్తా చాటిన బట్టేపాడు హైస్కూల్ విద్యార్థినీలు

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మండలం బట్టేపాడు గ్రామంలోని జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థినీలు రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరచి పాఠశాలకు గర్వకారణమయ్యారు. అండర్-17, అండర్-15 విభాగాల్లో బంగారు, కాంస్య పతకాలు సాధించిన విద్యార్థినిలను, వారికి శిక్షణనందించిన పీడీ కావాటి వెంకటకృష్ణయ్యను పాఠశాల ప్రాంగణంలో శనివారం ఘనంగా సన్మానించారు. రాష్ట్రస్థాయిలో మెరిసిన విద్యార్థినీలు 9వ తరగతి విద్యార్థిని సి. హెచ్. రాణి అండర్-17 విభాగంలో గోల్డ్ మెడల్ సాధించి పాఠశాల కీర్తిని రాష్ట్రవ్యాప్తంగా చాటింది. అలాగే 8వ తరగతి విద్యార్థినిలు వి.పల్లవి, యు.అలేఖ్య అండర్-15 విభాగంలో కాంస్య పతకాలు సాధించి ప్రతిభ కనబర్చారు. ఈ విజయాలకు క్రీడా ఉపాధ్యాయుడు పీడీ వెంకటకృష్ణయ్య అందించిన ప్రత్యేక శిక్షణే కారణమని ఉపాధ్యాయులు తెలిపారు. సన్మాన కార్యక్రమానికి టిడిపి ఎంపీటీసీ సభ్యులు డాక్టర్ తూమాటి శశిధర్ రెడ్డి, ఆత్మకూరు పట్టణ బిజెపి అధ్యక్షులు నున్న సంతోష్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. విద్యార్థులు పూలు చల్లి అతిథులను వేదికపైకి ఆహ్వానించి ఘన స్వాగతం పలికారు. విజేతలకు బహుమతులు అందజేసి శాలువాలతో సత్కరించారు. హెడ్మాస్టర్ డి.భార్గవి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత ప్రభుత్వ పాఠశాల నుండి రాష్ట్రస్థాయిలో విజయం సాధించడం ఎంతో గర్వకారణమని అన్నారు. అలాగే పిడి వెంకట కృష్ణయ్య ఏ పాఠశాలలో ఉంటే ఆ స్కూల్ రాష్ట్ర స్థాయిలో ఉంటుందని అన్నారు పాఠశాల క్రీడా విభాగాన్ని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తామని తెలిపారు. విద్యార్థినీలు ఇంకా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. టిడిపి ఎంపీటీసీ మెంబర్ తూమాటి శశిధర్ రెడ్డి మాట్లాడుతూ.. తాను చదువుకున్న పాఠశాల అభివృద్ధికి ఎల్లప్పుడూ తోడ్పాటు అందిస్తానని హామీ ఇచ్చారు. క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో మరింత ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. బిజెపి పట్టణ అధ్యక్షులు నున్న సంతోష్ కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదివినవారే జీవితంలో గొప్ప స్థానాలు అధిరోహించగలరని అన్నారు. గురువుల మార్గదర్శకత్వం వల్లే ఈ విజయాలు సాధ్యమయ్యాయని కొనియాడారు. భవిష్యత్తులో అవసరమైన సహాయాన్ని అందిస్తానని ప్రకటించారు విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన పిడికి శాలువాలతో ఘన సన్మానం చేసి బహుమతులు నున్న సంతోష్‌కుమార్ అందించారు. అతిథులను హెడ్‌మాస్టర్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు. రాష్ట్రస్థాయిలో క్రీడల్లో సత్తా చాటిన బట్టేపాడు జెడ్పీ హైస్కూల్ విద్యార్థినీల విజయంతో గ్రామంలో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి.



# ఇందిరా భవన్‌పై బీజేపీ దాడి అమానుషం : కే. సంజయ్ కుమార్

**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయం ఇందిరా భవన్‌పై బీజేపీ కార్యకర్తలు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కే.సంజయ్ కుమార్ తెలిపారు. డీసీసీ అధ్యక్షుడు నారపరెడ్డి కిరణ్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు సీనియర్ నాయకురాలు డా.యశోదర ఆధ్వర్యంలో వీఆర్‌సీ వద్ద అంబేద్కర్ విగ్రహానికి శనివారం వినతిపత్రం సమర్పించి శాంతియుత నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సంజయ్ మాట్లాడుతూ.. పార్టీ కార్యాలయం వద్ద ఎవరూ లేని సమయంలో బిజెపి పార్టీకి చెందిన కొందరు యువకులు రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దగ్ధం చేయడం, రాళ్లు రువ్వి అద్దాలు పగలగొట్టడం, ఫ్లెక్సీలు చింపడం బీజేపీ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని సంజయ్ విమర్శించారు. అదేవిధంగా దేశంలోని రైతులకు నష్టం కలిగేలా అమెరికాతో చీకటి ట్రేడ్ ఒప్పందంపై ప్రశ్నించినందుకే కాంగ్రెస్ కార్యాలయాలపై దాడులు చేస్తున్నారని ఆరోపించారు. అనంతరం జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు బాల సుధాకర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఆఫీస్ పై గతంలో దాడి చేసిన దాఖలాలు లేవని, పార్టీ కార్యాలయాలపై దాడుల సంస్కృతి బీజేపీ తీసుకువస్తుందని వాపోయారు. లీగల్ సెల్ చైర్మన్ అడ్వకేట్ సుధీర్ మాట్లాడుతూ పార్టీ ఆఫీస్ కార్యాలయాలపై దాడులు చేసిన వారిని గుర్తించి, ఇలాంటి దాడులు పునరావతం కాకుండా చట్టపరంగా చర్యలు తీసుకోవాలని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ నాయకులు అల్లాఉద్దీన్, రూరల్ మల్లికార్జున్ రెడ్డి, అధ్యక్షుడు రెహమాన్, ఓబీసీ నరేష్, హాజీ హనీ, సేవాదళ్ సుజాత, శ్వేత, సుధాకర్, ధనుంజయ్, పలువురు కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.



## ఉపాధిహామీ పథకంలో సామాజిక తనిఖీ గ్రామసభ



**సైదాపురం, మేజర్‌న్యూస్ :** సైదాపురం మండలంలోని మర్లపూడి గ్రామపంచాయతీ పరిధిలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనులపై సామాజిక తనిఖీలు అధికారులు సర్వే నిర్వహించారు. ఈ మేరకు మండలంలోని మర్లపూడి గ్రామంలో డిఆర్పి అధికారులు మూడు రోజులుగా గ్రామంలోని ఇంటి ఇంటికి వెళ్లి కూలీలు ఎంత పనిచేశారు ఎంత డబ్బులు పడ్డాయి అనే దానిపై సర్వే నిర్వహించారు సర్వే అనంతరం శనివారం గ్రామసభ ఏర్పాటు చేసి 2024-2025 సంవత్సరంలో మొత్తం 48 పనులు జరిగాయని ఈ పనులకు సంబంధించి కూలీలు వేతనాలు సమగ్ర కలుపుకొని మొత్తం 35,50,361 రూపాయలు ఇచ్చినట్లు తెలిపారు అలాగే పంచాయతీరాజ్ కింద రెండు వర్కులు చేయగా ఆ వర్కులకు సంబంధించి 1241511 రూపాయలకు పనులు జరిగాయని తెలిపారు.

## కలియుగ దైవంతో ఆటలాడితే తగిన మూల్యం తప్పదు : టీడీపీ నాయకులు



**తోటపల్లి గూడూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లా సర్వేపల్లి నియోజకవర్గం తోటపల్లి గూడూరు మండలంలోని. కోవెరపాలెం గ్రామంలో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఆదేశాల మేరకు శనివారం.మండల తెలుగుదేశంపార్టీ నేతలు. శాసనమండలిలో వైకాపా నేతలు ప్రవర్తించిన తీరును ఖండిస్తూ, కలియుగ దైవంగా భావించే వెంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారికి గోత్రనామాలతో టెంకాయలు కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల తెలుగుదేశం అధ్యక్షుడు కొణతం రఘుబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మి సురేంద్ర, ఈదురు బాబు నాయుడు మాట్లాడుతూ.. దేవుని చిత్రాలతో ప్రదర్శనలు చేయడం, చెప్పులను నిర్లక్ష్యంగా ఉంచడం హిందువుల మనోభావాలను దెబ్బతీసే చర్యలని విమర్శించారు. లడ్డూ కల్తీ అంశాన్ని ప్రజలను మభ్యపెట్టేందుకు వినియోగిస్తున్నారని ఆరోపిస్తూ, దేవాలయాల పరిరక్షణలో రాజకీయ లాభనష్టాలు చూడకూడదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మన్యం జితేంద్ర గౌడ్, గంగపట్నం సుధీర్ బాబు, చింతా సీతారామయ్య, తలమంచి నాగేశ్వరరావు, ముత్యాల గణేష్, గూడూరు నారాయణ, గుడ్లూరు గోపాల్ నాయుడు, మాగుంట రమణారెడ్డి, చావ కోటయ్య నాయుడు, తాండ్ర కృష్ణ, ఇంగిలాల చైతన్య, ఊటకూరు అవినాష్, చేవూరు శ్రీనివాసులు, మొగలిగుంట పోతన, మన్నెం మధుసూదన్ గౌడ్, తాళ్లూరు జీవరత్నం, భాస్కరయ్య, నటరాజ తదితరులు పాల్గొన్నారు.

## పరీక్షల నిర్వహణకు సర్వం సిద్ధం

● **ప్రిన్సిపాల్, అండ్ చీఫ్ సూపరింటెండెంట్ కృష్ణవేణి**



**రాపూరు, మేజర్‌న్యూస్ :** రేపటి నుండి ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని రాపూరు శ్రీసివికే ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పరీక్షల నిర్వహణ చీఫ్ సూపరింటెండెంట్ బి.కృష్ణవేణి శనివారం తెలిపారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి కట్టుదిట్టమైన ఏర్పాట్లను చేయడం జరిగిందని ఆమె **'మేజర్‌న్యూస్** ప్రతినిధికి' తెలిపారు. రాపూరు పరీక్ష కేంద్రంలో రాపూరు, సైదాపురం, కండలేరు జూనియర్ కళాశాల విద్యార్థిని విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. పరీక్ష నిర్వహణ సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ ను అమలు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థిని విద్యార్థులు నిర్ణీత సమయానికి పరీక్ష కేంద్రానికి రావాలని ఏమాత్రం ఆలస్యమైన అనుమతించే ప్రసక్తి లేదని ప్రిన్సిపాల్ కృష్ణవేణి తెలిపారు. ఇంటర్మీడియట్ పరీక్షల నిమిత్తం 12మంది సిబ్బందిని నియమించారని ప్రిన్సిపాల్ కృష్ణవేణి చెప్పారు. ఈనెల 23 నుంచి జరగనున్న ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల విద్యార్థిని విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. రాపూరు పరీక్ష కేంద్రంలో ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలకు 207మంది విద్యార్థులు, ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 193 మంది విద్యార్థులు హాజరు కానున్నారని, వీరితోపాటు ప్రథమ సంవత్సరం 18 మంది, ద్వితీయ సంవత్సరం 27మంది ఒకేషనల్ పరీక్షలకు మంది విద్యార్థులు హాజరవుతారని ప్రిన్సిపాల్ పరీక్షల నిర్వహణ చీఫ్ సూపరింటెండెంట్ బి.కృష్ణవేణి తెలిపారు.

## అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆత్మకూరులో శనివారం తెలుగు భారతి సేవాసంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రగతి ఇంగ్లీషు మీడియం పాఠశాలలో 6, 7, 8, 9 తరగతుల విద్యార్థులకు తెలుగు భాష మీద పద్యపఠనం, వక్తృత్వం, క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మాతృభాష ప్రాధాన్యాన్ని వక్తలు చక్కగా వివరించారు. తెలుగు భారతి సేవాసమితి అధ్యక్షులు సోమవరపు సుబ్బరాయుడు, సమితి ప్రతినిధులు ఎ.గోవిందరెడ్డి, ఎస్వి రమణయ్య, ఒమ్మిన సుబ్రహ్మణ్యం, కొల్లా వెంకటేశ్వర్లు, ఎస్.యానాది రెడ్డి, వెలిశెట్టి నారాయణరావు, ఎ.నారసింహారెడ్డి, డి.రాఘవేంద్రరావు, ఓ.శ్రీనివాస రాజు తదితరులు ఉపన్యసించారు.



# అజాత శత్రువు గౌతమ్‌రెడ్డి

**▸ ఘనంగా మేకపాటి గౌతమ్‌రెడ్డి వర్ధంతి ▸ భారీ స్థాయిలో అన్నదానం**

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** రాజకీయాలలో చాలా అరుదుగా దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి లాంటి వ్యక్తులు అజాత శత్రువుల్లాగా ఉంటారని, ఆయన చిన్న వయసులోనే ఆకస్మిక మృతి చెందడం బాధాకర మని పలువురు వైసీపీ నాయకులు పేర్కొన్నారు. ఆత్మకూరు మున్సిపల్ బస్టాండ్ వద్ద మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి ఆదేశాలతో దివంగత మంత్రి మేకపాటి గౌతమ్ రెడ్డి నాలుగో వర్ధంతిని శనివారం పార్టీ వర్గాలు ఘనంగా నిర్వహించారు. బస్టాండ్ ఆవరణలోని ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం నియోజకవర్గం పార్టీ పరిశీలకులు పేర్నాటి కోటేశ్వర రెడ్డి జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య, జెడ్పీటీసీ సభ్యురాలు పెమ్మసాని ప్రసన్న లక్ష్మీలు మాట్లాడారు. యువ పారిశ్రామిక వేత్తగా ఎదుగుతున్న సమయంలోనే గౌతమ్‌రెడ్డి 2009లో నెల్లూరు పార్లమెంటుకు మేకపాటి రాజమోహన్ రెడ్డి పోటీ చేయడంతో ఆయన విజయం కోసం తండ్రికి వెన్నుదన్నుగా నిలిచి అత్యధిక మెజార్టీతో గెలిపించిన వ్యక్తి గౌతమ్‌రెడ్డి అని కొనియాడారు. అనంతరం వైఎస్ జగన్మోహన్ రెడ్డి పిలుపు మేరకు రాజకీయాల్లోకి వచ్చి 2014 ఎన్నికల్లో ఆత్మకూరు నుంచి పోటీ చేసి ఘన విజయం సాధించి ప్రతిపక్ష ఎమ్మెల్యేగా తన సత్తాచాటారన్నారు. అప్పటి టీడీపీ ప్రభుత్వం అభివృద్ధి నిధులు కేటాయించకపోయినా సొంత నిధులతో నియోజకవర్గం లో ప్రజల దాహార్తిని తీర్చారన్నారు. 2019 ఎన్నికల్లో తిరిగి ఆత్మకూరు నుంచి పోటీ చేసి ఘన విజయం సాధించి రాష్ట్ర ఐటీ, పారిశ్రామిక మంత్రి గా రాణించారన్నారు. 28వేల కోట్ల రూపాయలతో రాష్ట్రంలో ఏపీ పారిశ్రా మిక మండళ్లు ఏర్పాటు చేసి నూతన చట్టం తీసుకొచ్చారన్నారు. దుర దృష్టవ శాత్తు ఆయన మృతి చెందారని, అంతకు రెండు రోజుల ముందు దుబాయిలో జరిగిన పారిశ్రామికవేత్తల సదస్సులో రాష్ట్రానికి రూ.10వేల కోట్ల పెట్టుబడుల హామీ తీసుకొని రూ.5వేల కోట్ల ఎంఓఈలు తీసుకొచ్చిన ఘనత గౌతమ్ రెడ్డిదేనన్నారు. ఆత్మకూరు నియోజకవర్గంలో పారిశ్రామిక అభివృద్ధికి 130 ఎకరాల్లో ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు చేయించిన ఘన త ఆయనదేనన్నారు. ఆయన ఆకస్మిక మృతి అనంతరం మేకపాటి కుటుం బం కోట్లాది రూపాయల విలువ గల 200 ఎకరాల భూమి కళాశాల భవ నాలను వ్యవసాయ యూనివర్సిటి కోసం ప్రభుత్వానికి అప్పగించిన ఘన చరిత్ర కలిగిందన్నారు. గౌతమ్‌రెడ్డి లేని లోటు తీర్చలేనిదని ఆయన ఆదర్శ మంత్రిగా, మచ్చలేని రాజకీయ నాయకుడిగా వ్యవహరించారన్నారు. ఆయన మృతితో అప్పటి ప్రతిపక్ష నాయకుడు అయిన చంద్రబాబు సైతం మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారని, అజాత శతృవు అనడా నికి ఇదే నిదర్శనమన్నారు. మేకపాటి విక్రమ్‌రెడ్డి నేతృత్వంలో దివంగత గౌతమ్‌రెడ్డి ఆశయాల సాధన కోసం సమిష్టిగా కృషి చేద్దామని పిలుపు నిచ్చారు. ప్రజల గుండెల్లో కొలువై ఉన్న గౌతమ్‌రెడ్డిని ఎవ్వరు దూరం చేయలేరన్నారు. అనంతరం భారీ స్థాయిలో అన్నదానం నిర్వహించారు. ఈకార్యక్రమంలో పార్టీ మున్సిపల్ విభాగ రాష్ట్ర కార్యదర్శి అల్లారెడ్డి ఆనంద్ రెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షుడు నాగులపాటి ప్రతాప్ రెడ్డి, ఎస్సీసెల్ విభాగం రాష్ట్ర కార్యదర్శి కొండా వెంకటేశ్వర్లు, మర్రిపాడు మండల కన్వీనర్ చెన్ను వెంకటేశ్వర రెడ్డి, గంగవరపు శ్రీనివాసులు నాయుడు, ఎంపీపీ బోయళ్ళ పద్మజ రెడ్డి, జిల్లా ఆర్గనైజేషనల్ సెక్రటరీ పులిమి రమేష్ రెడ్డి, పట్టణ మైనారిటి అధ్యక్షుడు మీరామొహిద్దీన్, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు నందా ఓబులేసు, ఎంపీపీ బి.పద్మజారెడ్డి, వైస్ ఎంపీపీ ప్రమీలా, నోటి వినయ్ కుమార్ రెడ్డి, నియోజకవర్గ పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు బొమ్మిరెడ్డి రవికుమార్ రెడ్డి, పట్టణ ఉపాధ్యక్షులు ఆంద్రా సుబ్బారెడ్డి, తోడేటి మణి, ఇందూరు సురేంద్రరెడ్డి, షేక్ రహీం, షేక్ పర్వీన్, గడ్డం శ్రీనివాసులరెడ్డి, కల్పనారెడ్డి, సోషల్ మీడియా కన్వీనర్ గోగుల బాల అంకయ్య, దాడి శ్రీనివాసులునాయుడు, మస్తాన్ వలీ, ఖాజామస్తాన్, రాచగొర్ల శంకరయ్య, కొండా వెంకటేశ్వర్లు, పాలేటి వెంకగళరెడ్డి, సురేష్ యాదవ్, శ్రీనివాసులునాయుడు, తోడేటి అశోక్, బొడ్డు గిరిబాబు, చెలికా హరిబాబు, జమ్రు, చిల్లూరు వెంకటేశ్వర్లు, నందవరం ప్రతాప్, రవిరెడ్డి, సత్యం, బత్తిన నారాయణరెడ్డి, యాకసిరి మల్లెంకొండయ్య, నందవరం ప్రతాప్, మల్లికార్జున, బాలచెన్నయ్య, వల్లెపు వెంకటేశ్వర్లు, శ్రీనివాస్ యాదవ్, వేణు, భారీ సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.







## కన్నులు పండువగా కళ్యాణోత్సవం



**రాపూరు, మేజర్‌న్యూస్ :** రాపూరు మండలంలోని పెంచలకోన క్షేత్రంలోని శ్రీ పెనుశీల లక్ష్మినృసింహా స్వామివారి కళ్యాణోత్సవం కన్నులు పండువగా జరిగింది. శనివారం కావడంతో స్వామివారి దేవస్థానంలో ఉదయం 4గంటలకు శ్రీస్వామివారికి అభిషేకం, 10.30 గంటలకు శ్రీవార్లకు కళ్యాణోత్సవం, సాయంత్రం 5.30 గంటలకు చెంచులక్ష్మీ, ఆదిలక్ష్మి సమేత నృసింహస్వామివారికి తిరుచ్చి పల్లకిసేవ తదితర ప్రత్యేక పూజ కార్యక్రమాలు ప్రధానార్చకులు, వేదపండితుల మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్య, గిరిజనుల వాయిద్య నడుమ సహస్ర దీపాలంకరణసేవ వైభవంగా నిర్వహించడం జరిగిందని దేవస్థానం ఉప కమీషనర్ అండ్ కార్యనిర్వహణాధికారి పొరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమాలకు భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదములు స్వీకరించినారని దేవస్థానం ఉప కమీషనర్ అండ్ కార్యనిర్వ హణాధికారి తెలిపారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కల్గకుండా క్యూలైన్ల, మంచినీరు సరఫరా, అన్నదానం తదితర కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరిగిందని దేవస్థానం ఉప కమీషనర్ అండ్ కార్యనిర్వ హణాధికారి పొరెడ్డి శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు.

## ఎపీ మోడల్ స్కూల్‌ను సందర్శించిన
## జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా



**కలిగిరి, మేజర్‌న్యూస్ :** కలిగిరి మండల పరిధిలోని ఎపీ మోడల్ స్కూల్‌ను జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా శనివారం సందర్శించి పాఠశాల నిర్వహణ, విద్యా బోధన విధానంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఉన్న హాజరు నమోదులు, గ్రౌండ్, ల్యాబ్స్, టాయిలెట్స్ తదితర మౌలిక వసతులను పరిశీలించారు. విద్యార్థుల విద్యా ప్రగతిపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకుని, నాణ్యమైన విద్య అందించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠశాలలో పరిశుభ్రత, సౌకర్యాల నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేసిన కలెక్టర్, విద్యార్థులకు మెరుగైన వాతావరణం కల్పించాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో పై గ్రౌండ్, ల్యాబొరేటరీలు, టాయిలెట్ల వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించాలని, విద్యార్థుల హాజరు శాతం పెంచేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. విద్యార్థులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని విద్యలో రాణించాలని ఆకాంక్షించారు.

## నిజాయితీ చాటుకున్న ఆటో డ్రైవర్

**● ఆటో డ్రైవర్‌ను సత్కరించిన పోలీసులు**



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** లక్షల విలువ చేసే బంగారం, దాంతో పాటు నగదు ఉన్న బ్యాగును తన వాహనంలో మరిచిపోయినా ఏ మాత్రం వాటిపై ఆశపడని ఆటో డ్రైవర్ నిజాయితీగ అప్పగించారు. శనివారం స్థానిక సీఐ గంగాధర్ విలేకరుల సమావేశంలో వివరాలు తెలిపారు. ఆత్మకూరుకు చెందిన దాసరి అమృతలక్ష్మి ఆత్మకూరు శివాలయం వద్ద ఆటో ఎక్కి బస్టాండ్ వద్ద దిగి నెల్లూరుకి బస్సులో వెళ్లిపోయింది. ప్రయాణించిన ఆటోలో మహిళ 13 సవర్ల బంగారు పదివేల నగదు విడిచి వెళ్ళిపోయింది. మహిళ సమాచారం తెలియని ఆటో డ్రైవర్ దానిని గమనించి స్థానికంగా ఉన్న ఒక షాపులో ఇచ్చి వెళ్ళాడు. తన బంగారు వస్తువులు బ్యాగును పోగొట్టుకుందని గుర్తించిన ఆ మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది.వెంటనే అప్రమత్తమైన పోలీసులు సిసి ఫుటేజ్ ఆధారంగా ఆటోను గుర్తించారు. వెంటనే మురగళ్ల గ్రామానికి చెందిన రమణయ్యగా గుర్తించి అతని ద్వారా షాపులో ఇచ్చిన 13 సవర్ల బంగారం, 10వేలు నగదును రికవరీ చేసి దాసరి అమృతలక్ష్మికి అందజేశారు. ఆటో డ్రైవర్ అభినందించి సీఐ చేతుల మీదుగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీఐ గంగాధర్, ఎస్సైలు జిలాని, సాయి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.